# ఈ కథకి రచయిత ఎవరు?

## మొవ్వ బాబూరావు



ఆదివారం...

అతి కష్టం మీద పొద్దున్నే లేచి హడావుడిగా పనులన్నీ ముగించుకుని ఎలాగైతేనేం ఆరో నెంబర్ బస్సు ఎక్కి హిమాయత్‌నగర్ బస్సుస్టాపులో దిగగలిగాను.. ఇంతసేపు బస్సులో కూర్చున్నందుకు బదులుగా కసిగా ఇంత దుమ్ము దిగిన పాసింజర్స్ మొదలేపి ముందుకు దూసుకుపోయింది ఆర్.టి.సి. బస్సు.

కళ్ళు నలుపుకుంటూ అటూ, ఇటూ చూడకుండా వడివడిగా నడవటం మొదలెట్టాను. తెలుగు సారస్వత హాల్లో వారం రోజుల్నించి తెలుగు రచయితల మహాసభలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో నలుమూలలనుంచి ఎంతోమంది రచయిత(త్రు)లు సభలో పాల్గొంటున్నారు. ఒక్కొక్క రోజు ఒకో అంశంపై రచయితలు తమ తమ అమూల్యాభిప్రాయాలు విశదీకరిస్తున్నారు. రోజూ పేపర్లలో సభలగురించి పాల్గొన్న రచయితల గురించి, వారు ఎన్నుకున్న అంశాలగురించి తెలియచేస్తున్నారు.

రెండు రోజుల్నించి ప్రయత్నిస్తున్నాను. ఈ సభలకి వద్దామని. బాస్‌గాడు ఒక్కరోజు సెలవు ఇవ్వమంటే ససేమిరా ఒప్పుకోలేదు. నా అదృష్టంకొద్దీ సభ చివరిరోజు ఆదివారం అవటం, బాస్ అత్తగారి ఊరికి వెళ్ళటం నేను చేసుకున్న పుణ్యం అనుకుంటున్నాను. లేకపోతే ఈరోజు కూడా ఈ ప్రోగ్రాంని మిస్సయ్యేవాణ్ని!

అందరు రచయిత(త్రు)ల్ని ఒకేచోట చూడటం, వారి వారి అభిప్రాయాల్ని, విమర్శల్ని వినటం... తలచుకుంటుంటేనే ఒళ్ళంతా పులకరిస్తోంది.

కథలన్నా, కవితలన్నా చదవటం నాకిష్టమైన హాబీ! ఏ కొత్త పుస్తకం మార్కెట్లోకి వచ్చినా కొని మరీ చదువుతాను. నేను రచయితను కాకపోయినా మంచి పాఠకుణ్ని. బెస్ట్ రైటర్‌కి అవార్డ్ ఇస్తున్నట్లే బెస్ట్ రీడర్‌కి అవార్డ్ ఇవ్వదలిస్తే నూటికి నూరు శాతం నేను అర్హుణ్నే. నాలాంటి పాఠకులేకదండీ.... ఏ తరం రచయితలకన్నా ఊపిరి. ఇన్నేసి కథలు చదివినా నేను ప్రత్యక్షంగా చూసిన రచయితలు చాలా తక్కువమందిని. వారి వారి కథల్నిబట్టి వాళ్ళ వాళ్ళ వ్యక్తిత్వాలని ఊహించుకుంటూ ఉంటాను. ఒక రచయిత వ్యక్తిత్వం ఆ రచయిత రచనల్ని బట్టి అంచనా వేయటం కూడా తప్పే! కానీ సగటు పాఠకుడి ఊహ అలానే ఉంటుందేమో?

నా ఆలోచనకన్నా వేగంగా కాళ్ళు పరిగెట్టి నన్ను హాలుముందు నిలబెట్టాయి. టైం పదిన్నర కావొస్తోంది. లోపల హాలంతా క్రిక్కిరిసిపోయింది. కూర్చున్న వాళ్ళలో చాలామంది రచయితలే అయ్యుంటారు. మా కాలనీలోని వర్ధమాన రచయిత్రి చుట్టుప్రక్కలవాళ్ళతో ఏకధాటిగా మాట్లాడుతూ ఉండటం నేను గమనించాను. వేదికమీద ఐదారుమంది కూర్చుని ఉన్నారు. వాళ్ళూ రచయితలే అని తెలుసుకున్నాను.

హాలంతా వెదుకుతుంటే మధ్యలో ఓ చోట ఖాళీ కుర్చీ కనిపించింది. అక్కడికెళ్ళి కూర్చోవచ్చా లేదా అనుకుంటుండంగానే కార్యకర్తల్లో ఒకరు కాబోలు వచ్చి అక్కడ ఒక కుర్చీ ఖాళీగా ఉంది కూర్చోండంటూ మర్యాదగా చెప్పిపోయాడు.

అక్కడి వాతావరణం చూస్తుంటే అతనూ రచయితేమో అనిపించింది. ఇలాంటి సమావేశాలకి ఒక్కరూ వస్తే ఎంత ఒంటరితనంగా ఫీలవుతామో అప్పుడనిపించింది.

కూర్చోటానికి సీటు దొరికేసరికి ఎంతో సంతోషంగా అనిపించింది. హాయిగా మొత్తం కార్యక్రమము అంతా అయ్యేదాకా ఉండచ్చు అనుకుంటూ తెగ ముచ్చట పడిపోతూ నెమ్మదిగా దాటుకుంటూ ఆ కుర్చీ దగ్గరకి చేరాను. తాపీగా కూర్చుని చుట్టుప్రక్కలా చూసాను. చాలామంది చేతుల్లో చిన్న చిన్న డైరీలు ఉన్నాయి. ఏవో విషయాలు నోట్ చేసుకుంటున్నారు.

స్టేజీ మీదున్న ఒకాయన మైకు దగ్గరకొచ్చి, కథా, కథనం ఎలా ఉంటే బావుంటుందని వివరంగా తెలియచేస్తున్నారు.

"కథ ఎలా ప్రారంభించినా దానికి చదివించే గుణం ఉండాలి. తను రచించిన రచన ఎంతో

సహజంగా ఉందనుకుంటాడు రచయిత. ఆ రచనని పాఠకులు చదువుతున్నప్పుడు అలా అనుకోకపోవచ్చు. రచయిత ఉద్దేశ్యంలో ఉన్న సహజత్వం పాఠకుడికి అసహజంగా అనిపించవచ్చు. రచనలు పాఠకుల మనస్సుని ప్రభావితం చేయగలిగితే ఆ రచయిత గొప్పవాడే!"

వెనకసీటాయన కాలుతో నా కుర్చీకి చేస్తున్న శబ్దం తప్పా హాలంతా నిశబ్దంగా ఉంది.

కథకి ప్రాణవాయువైన కథనం గురించి ఆయన చెప్తుంటే ఆయనెవరో పేరు మోసిన రచయితే అనుకున్నాను. కానీ ఎవరో తెలీటంలేదు. ప్రక్కవాళ్ళని అడుగుదామనుకుంటే అదోరకమైన కాంప్లెక్స్ నాలో ఆవహించింది.

అక్కడక్కడ చెణుకులూ, బెణుకులూ వేస్తూ తన ఉపన్యాసం ముగించాడు స్టేజీ మీదున్నాయన.

సభాధ్యక్షులనుకుంటా కుర్చీలోనుంచి లేచి "కరిగే కృష్ణారావుగారి సహజమైన కథ, సమంజసమైన కథ ఎలా ఉండాలో, ఎంతో చక్కగా తనదైన శైలిలో వివరించారు. ఆయన చెప్పిన అంశాలు ప్రాతిపదికగా తీసుకుని రచనల్ని చేస్తే మరిన్ని మంచి రచనలు వస్తాయి. అనుభవజ్ఞులు అనుభవాలు ఎప్పటికీ ఆచరణలో పెట్టతగ్గవే!" అంటూ కృష్ణారావుగారికి కృతజ్ఞతలు తెలియచేసారు.

అరె! కరిగే గారంటే ఈయనే అన్నమాట. చాలా గొప్ప రచయిత. ఆయన కథల్ని నేను ఎన్నో చదివాను. ఏ పాఠకుడైనా తనకున్న అభిప్రాయమే రచయిత రచనల్లో కనబడితే ఆ రచయితకి మానసికంగా దగ్గరవుతాడు. నా ఉద్దేశ్యంలో కృష్ణారావుగారు అంతే!

ప్రఖ్యాత రచయిత్రి శ్రీమతి ఆలోచనా రాణిగారు నవ్య కథ సవ్యంగా పాఠకులకి ఎలా చేరగలుగుతుందో అనే అంశంపై తెలియచేసిన పద్ధతి అద్భుతం. ప్రత్యక్షంగా ఆవిడ్ని చూడటం, మధురమైన ఆమె గొంతు ద్వారా అనేకమైన కొత్త విషయాలు వినటం నా అదృష్టంగా భావిస్తున్నాను. అక్కడక్కడ ఆవిడ ఉదహరిస్తున్న హాస్యోక్తులు అందర్నీ అలరించాయి. నా కుర్చీ వెనుక కాళ్ళతో కొడుతున్న శబ్దం లేకపోతే నేను ఇంకా ఎంతో హాయిగా నవ్వి ఉండేవాణ్ణనిపించింది.

రచయితల్ని ప్రత్యక్షంగా చూస్తూ వాళ్ళ వాళ్ళ కథలని మననం చేసుకుంటుంటే అవ్యక్తమైన అనుభూతి కలుగుతోంది. సభలని ఏర్పాటుచేసిన కార్యకర్తలని మనసారా అభినందించాలి. కూర్చున్నవాళ్ళలో ఒక్కొక్కరు లేచీ తమకిచ్చిన అంశం గురించి తమదైన ధోరణిలో తెలియచేస్తున్నారు. కథ ఎలా ఉండాలి, కథకి కావల్సిన ముఖ్యమైన ముడిసరుకులేమిటి, శిల్పం అంటే ఏమిటీ.... శైలి ఎలా ఉండాలి ఇత్యాది అంశాలపై ఒక్కొక్కరు విశ్లేషిస్తుంటే అప్పటికప్పుడు నాకే ఒక కథ రాసిపారేయాలనిపించింది.

హరప్పాగారు శబ్ద కాలుష్యం అనే అంశం మీద ఉపన్యసిస్తారు" అని అధ్యక్షులవారు తెలియచేసారు.

హరప్పాగారు స్టేజిమీదకి వచ్చారు.

అరె! హరప్పాగారంటే ఈయనేనా?! హరప్పాగారు నా అభిమాన రచయిత. నా అభిప్రాయాలు, నాలో ఉన్న ఎన్నో మానసిక సంఘర్షణలు ఆయన కథల్లోని పాత్రల్లో ఉన్నాయి. తాటిముంజలో నీళ్ళు ఎలా వస్తాయో తెలియనట్లే ఆయన రచనల్లో శిల్పం అంతర్లీనంగా మిళితమై ఉంటుంది. ఆయన కథలు ఎన్నో ఇతర భాషల్లో అనువదించబడ్డాయి. తెలుగు పాఠకులు ఎన్నడూ మరచిపోలేని ఎన్నో కథలని ఆయన అందించారు.

ఇప్పుడాయనకి ఇచ్చిన అంశం శబ్దకాలుష్యం. ఎంతో ముఖ్యమైన అంశం. శబ్ద కాలుష్యం సబ్జెక్ట్ మీద తగినన్ని రచనలు రావటంలేదని ఆయన వాపోయారు. అదేదో నిస్సారమైన అంశంగా భావించి దానిమీద ఎవ్వరూ దృష్టి సారించటం లేదు. రచయితలు ఎప్పటికప్పుడు నూతనత్వాన్ని, సరికొత్త అంశాలని రచనల్లో ప్రవేశపెట్టినపుడే ఆ రచనలకి సార్థకత కలుగుతుంది. ఆ రచయిత పాఠకులకి మరింత దగ్గిరవుతాడు. ఆయన అనుభవాన్ని ఒకటి ఉదహరించారు.

ఒక ఇంట్లో ఒక రోగి ఎంతో బాధపడుతూ ఉంటాడు. ఏమాత్రం అలికిడైనా ఉలిక్కిపడుతూంటాడు. అదేరోజు ఒక రాజకీయపార్టీవాళ్ళు బాజా భజంత్రీలతో ఊరేగింపుగా పోతూ ఉంటారు. చిన్న అలికిడైనా భరించలేని రోగి ఆ శబ్దాన్ని వినలేక మంచం మీదే ప్రాణాలు విడిచేస్తాడు. శబ్ద కాలుష్యం ద్వారా ఇటువంటి సంఘటనలు ఎన్నో ఉన్నాయి.... కాదంటారా?

హరప్పాగారు ఉదాహరణకై చెప్పిన అనుభవం వాస్తవం. శబ్ద కాలుష్యానికి అంతకు మించిన ఉదాహరణ మరొకటి ఉండదేమో!!

సహజత్వానికి దగ్గిరున్న ఏ ప్లాటయినా మంచి కథని మలచటానికి ఉపయోగపడుతుందని నిస్సందేహంగా చెప్పొచ్చు. నిస్సారమైన అంశం మీద ఎంత గొప్ప కథ రాయొచ్చో ఆయన తెలియచేసిన పద్ధతికి సభ చప్పట్లతో మారుమ్రోగింది. వెనుకనుంచి కుర్చీ చప్పుడు కాకపోవటంతో నేను ఈసారి మరింత హుషారుగా చప్పట్లు కొట్టాను అందరితోపాటు.

కృతజ్ఞతలు తెలియజేసి హరప్పాగారు స్టేజీ దిగి నా వెనుకవైపు వెళ్ళారు. ఒక్కసారి ఆయన్ని అభినందిస్తున్నట్లు దబీమని తల వెనక్కి తిప్పి చూసాను. నా వెనుక కుర్చీ ఖాళీగా ఉంది. దానిమీద ఆయన నెమ్మదిగా కూర్చుంటున్నారు. "చాలా బాగా చెప్పారు సార్" అప్రయత్నంగా అనేసాను.

థాంక్స్ అంటూ ఆయన చిరునవ్వు చిందించారు.

ఏదో గుర్తుకొచ్చిన వాడిలా ఒక్కసారి ఖంగుతిన్నాను. నేను కూర్చున్నప్పటినుంచి నా ముందు వరుసనుంచి గానీ, వెనకనుంచి గాని ఎవరూ స్టేజిమీదకి వెళ్ళలేదు. ఇందాకట్నించీ కాలితో విలాసంగా నా కుర్చీని వెనుకనుంచీ తంతోంది హ..ర..ప్పాగారనేది నమ్మలేని నిజం. శూన్యంలోకి పిచ్చి చూపులు చూస్తూ అలానే కూర్చున్నాను మళ్ళీ కుర్చీ శబ్దం వింటూ. ఆయన స్టేజీ మీద చెప్పిన శబ్ద కాలుష్య ప్రభావంలో ఇది ఒక భాగం కాదా? ఒక్క క్షణం ఇంక అక్కడ కూర్చోబుద్ధి కాలేదు. ఉన్నట్లుండి లేచి గబగబా బయటకి దారితీసాను. ❋



## ఓల్డ్ ఈజ్ గోల్డ్

సుప్రసిద్ధ హాలీవుడ్ తార మైకేల్‌డ్గ్లస్ నేను జీవితంలో టీన్స్‌గాని, నాతో సరిసమానమైన వయసున్న వాళ్ళతో గాని ఎప్పుడూ డేటింగ్ చేయలేదు. ఎందుకంటే నాకు నాకంటే చాలా పెద్దవయసున్న ఫ్రెండ్స్‌తో ఫ్రెండ్షిప్ వుంది.

పెద్దవయసుతో బాటు పెద్ద అనుభవంకూడా వుంటుందికదా! ఆ అనుభవం ఇచ్చిన అనుభూతి గొప్పది అంటోంది మైకేల్ అందుకే మరి ఓల్డ్ ఈజ్ గోల్డ్ అన్నారు.